# మెనూ పాటిస్తున్నారా?

- సౌకర్యాలపై ఆరా తీసిన ప్రావీణ్య
- కమలాపూర్ ఎంజేపీలో కలెక్టర్ బస
- కలెక్టర్‌కు తప్పని కరంటు కష్టాలు



విద్యార్థులతో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

కమలాపూర్, సెప్టెంబర్ 12: కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల బీసీ గురుకుల విద్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్య గురువారం రాత్రి బస చేశారు. జిల్లాలో తొలిసారి బాలికల విద్యాలయంలో బస చేసేందుకు కలెక్టర్ రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వసతిగృహం, నిత్యావసర సరుకులు, వంట గదిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ మెనూ ప్రకారం అన్నీ ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాల లేదా హాస్టల్‌లో బస కార్యక్రమంలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. ఉదయం విద్యార్థులతో మమేకం కానున్నట్లు చెప్పిన కలెక్టర్.. స్మాట్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ భోజనం చేశారు. అయితే కలెక్టర్ గురుకులంలో ఉండగానే 7:38 నుంచి 7:43 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటి అలుముకుంది. ఐదు నిమిషాల పాటు కరంటు పోవడంతో అధికారులు కంగారుపడ్డారు. కార్యక్రమం లో ఆర్డీవో వెంకటేశ్, డీఈవో వాసంతి, ఎం జేపీ ఆర్సీవో రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ సౌజన్య, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేశ్‌కుమార్ తదితరులున్నారు.



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలో గురుకులం

## రౌడీ రాజకీయం

**రౌడీ రాజకీయాలకు** సిటీ అడ్డాగా మారిందా..? హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయా..? అంటే అవుననే సమాధానం వస్తున్నది. పట్టపగలు.. నగరం నడిబొడ్డున.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడటం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ.. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వచ్చారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే అప్పటికే కౌశిక్‌రెడ్డి హౌస్ అరెస్టులో ఉండగా, గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ.. ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో గేటు దూకి కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు.. అక్కడే ఉన్న బీఆర్ఎస్ శ్రేణులపై దాడికి దిగారు. కుర్చీలన్నీ చెల్లాచెదురు చేసి.. కోడిగుడ్లు, టమాటాలు విసిరేసి.. ఇంటి అద్దాలు.. పూలకుండీలు ధ్వంసం చేసి.. కాంగ్రెస్ శ్రేణులు యుద్ధవాతావరణాన్ని సృష్టించారు. పోలీసులపైనా చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే గాంధీ దాడి చేసేలా వారిని ఎగదోశారు. ఇంత జరుగుతున్నా.. గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాన్ని పోలీసులు నిలువరించలేకపోయారు. ఇదిలా ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడిని ముక్తకంఠంతో ఖండించిన బీఆర్ఎస్ నేతలు.. నిరసనలతో హోరెత్తించారు. ఇదేం ప్రజాపాలన.. ఇదేం ఇందిరమ్మ రాజ్యం.. అంటూ నిలదీశారు. తెలంగాణను రౌడీ రాజకీయాలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నినదించారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు భద్రత కరువైందని.. పక్కా ప్రణాళికతోనే దాడి జరిగిందంటూ.. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు సైతం ధ్వజమెత్తారు.

*- సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ)*



దాడికి ఉసిగొల్పుతున్న ఎమ్మెల్యే గాంధీ కుమారుడు



# గాంధీ.. గూండాగిరి

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి

- పట్టపగలు.. నగరం నడిబొడ్డున
- హౌస్ అరెస్ట్ చేసి.. ఘర్షణకు ఉసిగొల్పి..
- మందీమార్బలంతో వాహనాల్లో వచ్చి..
- గేట్లపై నుంచి దూకి.. ఇంట్లోకి ప్రవేశించి..
- రాళ్లు రువ్వి.. గుడ్లు విసిరి.. టమాటాలతో దాడి
- ఇంటి అద్దాలు.. పూల కుండీలు ధ్వంసం
- కుర్చీలన్నీ చెల్లాచెదురు చేసి..
- యుద్ధవాతావరణం సృష్టించిన కాంగ్రెస్
- సిటీలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కరువైన భద్రత
- దాడిని ఖండించిన నగరవాసులు
- రౌడీ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్

**ప్రజాస్వామ్యం అపహాస్యమైందంటూ..**

**రేవంత్‌రెడ్డి పాలనపై ధ్వజం**



ధ్వంసమైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు



కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి దూకుతూ..




సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద బైఠాయించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



కుర్చీలు విసురుతూ.. బీభత్సం సృష్టిస్తున్న కాంగ్రెస్ గూండాలు



కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దూసుకొస్తున్న కాంగ్రెస్ నాయకుడు



ఇదేం దౌర్జన్యకాండ!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, వివేకానంద్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

## మీ సేవకు అంతరాయం

***సర్వర్ ప్రాబ్లమ్‌తో మూడు రోజులుగా నిలిచిన పౌర సేవలు***

మహబూబాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : మీసేవ కేంద్రాల్లో మూడు రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. హైదరాబాద్‌లోని మెయిన్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలకు అంతరాయం ఏర్పడింది. కులం, నివాసం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్యుత్ సంస్థకు సంబంధించిన 40 రకాల సేవలను ప్రజలు వినియోగించుకుంటున్నారు. మూడు రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో దరఖాస్తుదారులు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు.

## సీకేఎంలో నిలిచిన స్కానింగ్ సేవలు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మహిళల ఇబ్బందులు
- బదిలీపై వెళ్లిన వారి స్థానంలో చేపట్టని భర్తీలు
- భారమైనా ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న గర్భిణులు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 12 : వరంగల్‌లోని చందా కాంతయ్య మెమోరియల్ (సీకేఎం) ఆస్పత్రిని సిబ్బంది కొరత వేధిస్తున్నది. స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా టెక్నీషియన్ లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది మహిళలకు ఉచిత సేవలందిస్తున్న ఈ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. గర్భస్థ శిశువు ఎదుగుదల, ఆరోగ్య స్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రత్యేక పరిస్థితుల్లో చేసే స్కానింగ్‌లను నిర్వహించేందుకు సిబ్బంది కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో సర్కారు వైద్యాన్ని మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఆధునిక యంత్ర పరికరాలు, వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో సీకేఎం ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇటీవల ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు రేడియాలజిస్టులు బదిలీ కాగా, ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం పీజీ డాక్టర్ మాత్రమే నామమాత్రంగా సాధారణ స్కానింగ్‌లు చేస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు భారమైనా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించక తప్పడం లేదని గర్భిణులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేడియాలజిస్టులతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని మహిళలు కోరుతున్నారు.



సిబ్బంది లేక నిరుపయోగంగా ఉన్న స్కానింగ్ యంత్రాలు

## తెలంగాణలో ఫ్యాక్షనిజానికి తెరలేపారు

- ఇందిరమ్మ రాజ్యంతో ఎమ్మెల్యేలకు రక్షణ కరువు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, సెప్టెంబర్ 12 : తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫ్యాక్షనిజానికి, రౌడీ రాజకీయాలకు తెరలేపుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన గూండాలతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రతినిధులతో కలిసి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేస్తున్న కౌశిక్‌రెడ్డిని టార్గెట్ చేసి దాడులు చేయించడాన్ని చూస్తే ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేకు రక్షణ కరువైనట్లు స్పష్టమవుతున్నదన్నారు. ఓ వైపు కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం గృహనిర్బంధంలో ఉంచగా, మరోవైపు పోలీసుల ముందే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు ఇంటిపై దాడులు చేయించడాన్ని చూస్తే తెలంగాణలో ఫ్యాక్షన్ సంప్రదాయానికి, రౌడీయిజానికి బీజాలు పడ్డట్టు అర్థమవుతున్నదన్నారు. ఇది కచ్చితంగా సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన దాడేనని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఉడుత ఊపులకు భయపడేది లేదని, ఇంతకుమించిన ప్రతిఘటన ఉంటుందని మరవొద్దన్నారు. తెలంగాణ రాజకీయాలంటే ఇన్నాళ్లూ క్రమశిక్షణకు గీటురాయని దేశంలోని ఇతర రాష్ట్రాలు భావించేవని, ఈ సంఘటనతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పట్ల దేశానికి ఏం సంకేతాలు ఇస్తున్నదని ఆయన ప్రశ్నించారు. ప్రజలు తక్కువ సమయంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని, రానున్నది కేసీఆర్ ప్రభుత్వమని దాడుల లెక్కల తేల్చుతామన్నారు.

## హ్యాట్సాఫ్ రఘు

- నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని ఇన్‌స్టాలో వీడియో
- వివిధ దేశాల నుంచి స్పందించిన దాతలు
- 15 రోజుల్లోనే రూ. 21 లక్షలు జమ
- చిన్నారుల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్



**కురవి: బ్యాంకు మేనేజర్ నుంచి బాండ్ తీసుకుంటున్న రఘు**

కురవి, సెప్టెంబర్ 12 : సాయం చేయాలంటే ఆస్తులుండాల్సిన అవసరం లేదు.. తపన, సంకల్పం ఉంటే చాలని నిరూపించాడు మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన గంగరబోయిన రఘు. ఓ నిరుపేద కుటుంబాన్ని అండగా నిలువాలనే అతడి ప్రయత్నం వల్ల ఆ ఇంట వెలుగులు నింపాయి. వివరాలిలా ఉన్నాయి. నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామానికి చెందిన బేతమల్ల నరేశ్–ఉమ దంపతులది నిరుపేద కుటుంబం. వారికి ఒక అమ్మాయి రెక్వితా ఉండగా, రెండో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఉమ పది రోజుల వ్యవధిలోనే (జూలై 28న) మెదడులో రక్తం గడ్డకట్టి మృతిచెందింది. నరేశ్ ఏ పని చేయకపోవడం, పిల్లలిద్దరిని చూసుకోకపోవడంతో విషయం తెలుసుకున్న రఘు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను ఆగస్టు 1న పోస్టు చేశాడు. వివిధ దేశాల నుంచి రఘు ఫాలోవర్స్ ఆ వీడియోకు స్పందించి తమ వంతు సాయం చేయడంతో కేవలం 15 రోజుల్లోనే రూ. 21 లక్షలు సమకూరాయి. ఈ డబ్బుల నుంచి పాప, బాబు పెంపకం కోసం రూ. 4 లక్షలు ఉంచి, మిగిలిన రూ. 17 లక్షలు చిన్నారుల పేరిట గురువారం మహబూబాబాద్ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, మేనేజర్ సునీల్ కుమార్ ద్వారా బాండ్ తీసుకున్నాడు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు చొరవ చూపిన రఘును సబ్బండ వర్గాలు అభినందిస్తున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు దుద్దెల వినోద్, కల్లెపు పవన్, చింతమల్ల యాకన్న, రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘు తపన, తాపత్రయం చూసి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కుమారుడు రవిచంద్ర ఐ ఫోన్‌తో పాటు రికార్డు చేసే పరికరాలను తన సొంత ఖర్చులతో అందజేశారు. బ్యాంకు నుంచి తీసుకున్న బాండ్‌ను జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేయనున్నట్లు రఘు పేర్కొన్నారు. సహకరించిన దాతలకు, బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## కూలిన ఇళ్లు 610, తెగిన రోడ్లు 148

- వరదలతో మానుకోట జిల్లాలో భారీ నష్టం
- తాత్కాలిక, శాశ్వత పనుల కోసం రూ.275 కోట్లు అవసరం
- ప్రభుత్వానికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ నివేదిక



*గార్ల : కోమట్లగూడెంలో కూలిన ఇళ్లు (ఫైల్)*

మహబూబాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలతో మహబూబాబాద్ జిల్లాలో జరిగిన నష్టంపై అధికారులు తుది నివేదిక సిద్ధంచేశారు. ఈమేరకు గురువారం రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ నివేదికలను కలెక్టర్‌కు సమర్పించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో జిల్లావ్యాప్తంగా 52చోట్ల రోడ్లు తెగిపోగా 189 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. వీటికి గాను తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.6 కోట్లు, శాశ్వత నిర్మాణాల కోసం రూ. 177.70 కోట్లు అవసరమని నివేదించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 96 చోట్ల రోడ్లు తెగిపోగా, మరికొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. వీటికి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.3.5 కోట్లు అవసరమని, శాశ్వత నిర్మాణాల కోసం రూ.60 కోట్లు కావాలని నివేదిక సమర్పించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో 10 చోట్ల బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని ఇందుకోసం రూ.5 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రభుత్వానికి సంబంధించిన శాఖలు నివేదించాయి. అలాగే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 74 చోట్ల బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని ఇందుకోసం రూ.20 కోట్ల వరకు శాశ్వత నిధులు అవసరమని నివేదించారు.

**మునిగిన ఇండ్లు 1,180**

జిల్లావ్యాప్తంగా 610 పూర్తిగా నేలమట్టం అయ్యాయి. అతి భారీ వర్షాల వల్ల వచ్చిన వరదతో మరిపెడ మండలం ఉల్లేపల్లి, సీతారాంతండా, నెల్లికుదురు మండలం రావిరాల, డోర్నకల్ మండలం దుబ్బతండా తదితర ప్రాంతాల్లో 1,180 ఇండ్లు నీటిలో మునిగాయని వీరికి ఇంట్లోని వస్తువులు కొట్టుకుపోగా, మరికొంత తడిసి ముద్దయ్యాయని నివేదిక సమర్పించారు.

**ఎన్పీడీసీఎల్‌కు రూ.3.50 కోట్ల నష్టం**

ఎన్పీడీసీఎల్‌కు రూ.3.50 కోట్ల నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 2,189 విద్యుత్ స్తంభాలు, 312 ట్రాన్స్‌ఫార్మర్లు, 170 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు దెబ్బతిన్నట్లు విద్యుత్ అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

## పిచ్చి కుక్క స్వైర విహారం

*11 మందికి గాయాలు*

చిట్యాల, సెప్టెంబర్ 12 : పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 11 మందిని గాయపర్చింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపల్లి(సీ) కూడలి వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ కుక్క స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన వారిపై దాడి చేసింది. చిట్యాలకు చెందిన లత, రక్షిత, రాజేశ్వరి, రమేశ్, రికిత, ఆదిరెడ్డి, ముచినిపర్తికి చెందిన లింగయ్య, తిరుమలాపూర్‌కు చెందిన సునీత, కవిత, వెంకట్రావుపల్లి(సీ)కి చెందిన సది, టేకుమట్లకు చెందిన అనూషకు గాయాలు కాగా, వెంటనే మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం సరైన మందులు లేకపోవడంతో భూపాలపల్లిలోని ప్రధాన దవాఖానకు బాధితులను తరలించారు. కాగా, గ్రామస్తులు ఆ పిచ్చి కుక్కను చంపేశారు.